# మల్లెలమనసు

బ్యాంకు ఉత్తరాలు ఇన్వర్డ్‌ట్రేలో వేసి, సిబ్బందికి వచ్చిన వాటిని మాత్రం వాళ్ళవాళ్ళ సీటు దగ్గరికి వెళ్ళి చిరునవ్వుతో అందించడం పోస్టుమాన్‌కు అలవాటు. బ్యాంకు ఉత్తరాల కట్ట ట్రేలో వేశాడు. సిబ్బంది లేఖలన్నీ అందించగా ఒక ఇన్‌ల్యాండ్ లెటర్ మిగిలిపోయింది. పేరు ఒకటికి రెండుసార్లు చదివాడు.

'భట్లపెనుమర్రు వెంకట శ్రీనివాస సత్యారావు' అని వుంది. ఆ బ్యాంకు సిబ్బందిలో అంత పొడుగాటి పేరున్న వాళ్ళెవరా అని రెండు మూడుసార్లు తల గోక్కున్నాడు. బట్వాడా చేయవలసిన ఉత్తరాల సంచి తొందరపెడుతోంది. నిరాశతోనే దాన్ని ట్రేలో పడేసి నీరసంగా మెట్లు దిగి వెళ్ళిపోయాడు. తన పదేళ్ళ సర్వీసులో పూర్తి చిరునామా, పిన్‌కోడ్ వున్నా ఇవ్వలేక, దిక్కుతోచక వదలిపెట్టిపోవడం ఇది మొదటిసారి. ఇలాంటి పరిస్థితి ఏ పోస్టుమ్యాన్‌కు రాకూడదని అనుకున్నాడు.

బ్యాంకు ఉత్తరాల కట్ట తీసుకుపోతూ ఆఫీస్‌బాయ్ ఇన్‌ల్యాండ్ లెటర్ చూసి ఆశ్చర్యపోయాడు. పోస్టుమ్యాన్‌కి కూడా బద్ధకం ఒంటపడుతోందా అని గతుక్కుమన్నాడు. ఆ బద్ధకం ముదిరితే ఇక తానే అందరికీ ఉత్తరాలివ్వవలసి వస్తుంది. అదొక కొత్త చాకిరి అయినా ఎక్కడో గుండెలో జాలి కర్తవ్యానికి పురికొల్పింది. తన ఐ.క్యూకు ఇదొక పరీక్షగా భావించాడు. ఒక ఆలోచన తళుక్కుమంది. తక్షణం లేడీ టైపిస్ట్ దగ్గరికి వెళ్ళి తన సమస్య చెప్పాడు. ఆ అమ్మాయి ఉత్తరాన్ని చూసింది. తిరగేసింది. కనురెప్పలు చకచకా ఆడించింది. మెరుపు తీగలు కదలాడాయి. 'మన శీనుదైవుంటుంది. వెళ్ళు' అంది. ఆమెది కంప్యూటర్ మెదడై వుంటుందని ఆఫీస్ బాయ్ అంచనా. అది నిజమే అయింది. ఆ ఉత్తరం శీనుదే!

శీను పేరు ఆ బ్యాంకు సిటీ బ్రాంచీలన్నింటిలో సుపరిచితం. ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది- శీను చాలా చాలా మంచివాడు. సిటీలో వుంటున్నా ఒక్క దుర్గుణం కూడా అలవడలేదు. మర్యాద అతని సొత్తు. అందరికీ తలలో నాలుకలా మెలుగుతాడు. రెండోది - నిన్న మొన్నటి దాకా సినీహీరోలా అందాలు నింపుకున్న బ్రహ్మచారి. పెళ్ళయి నాలుగు మాసాలయింది.

శీనుకు ఉత్తరాలు బ్యాంకుకు రావు. ఇంటికే వస్తాయి. ఉత్తరం వాళ్ళ నాన్న రాశాడు. శీను ఇటీవలే ఇల్లు మారాడు. కొత్త అడ్రసు రాయడం మర్చిపోయాడు. అందుకే బ్యాంకుకు వచ్చింది. అసలు సంగతి వెంటనే తెలుసుకోవాలని లాంఛనాలు గుప్పించిన మొదటి పేరా వదిలేసి రెండో పేరా మీద రెండు కళ్ళు లగ్నం చేశాడు.

ఇక్కడో మాట గమనించాలి. శ్రీనివాసరావు అనేది శీను పితామహుడి పేరు. సత్యనారాయణ మాతామహుడి పేరు. రెండు పేర్లు జోడించి నామకరణం చేశారు. పురుషాధిక్యం చాటుకోవడానికి శ్రీనివాసరావు పేరు ముందుకు వచ్చింది. అంతటితో ఆగలేదు. లోకమంతా శీను అన్నా తల్లి మాత్రం 'సత్యం' అనే ముద్దుగా, సగర్వంగా పిలుస్తుంది. ఆవిడే కాదు, తల్లి తరపు వాళ్ళందరూ అలాగే పిలుస్తారు. ఉత్తరంలో ఈ రెండు పేర్లు కనిపించడానికి వెనక వున్న కథ ఇది. ఇక ఉత్తరంలోని ముఖ్యవిషయాలు - "నీ ఉత్తరం ఒకటికి పదిసార్లు చదువుకున్నాం. నా బిడ్డ సత్యం ఎంత ఎదిగిపోయాడోనని మీ అమ్మ సంబరపడి వీధివీధంతా చెప్పుకుని మురిసిపోయింది. మీరిద్దరూ దసరా పండక్కి ఇక్కడికి రాలేమని రాశావు. పండక్కి దూరంగా వుండి పోతున్నారనే బాధ వుంటుంది. సహజమే. అయితే పండక్కి చెల్లెల్ని, బావగారిని మీ దగ్గరికి రప్పించుకోవడం మాకు చాలా ఆనందం కలిగించింది. నిజమే. తల్లిదండ్రుల తర్వాత ఇంటి ఆడపడచు సంగతి చూసి వారి అచ్చటా, ముచ్చటా తీర్చవలసింది అన్నా వదినే కదా! ఈ బాధ్యత పెళ్ళయిన కొద్ది మాసాలకే వహించడం విశేషం. న్యాయంగా పెళ్ళయిన మొదటి పండగకి మీ చెల్లి, బావ ఇక్కడికి రావాలి. కానీ మీ మాట కాదనలేక నేరుగా తాడేపల్లిగూడెం నుంచి గోదావరిలో మీ వద్దకు వస్తున్నారు. కోడలు చి.ల.సౌ. మాధవి అన్నీ తెలిసిన అమ్మాయి. ఈ ఇంటి కోడలుగా రావడం మా అదృష్టం. ఇక్కడ అంతా క్షేమం. మా ఆరోగ్యం పరవాలేదు. పల్లెటూరు. కాలం గడిచిపోతోంది. అంతా తెలిసిన వాళ్ళే. ఏ సాయం కావాలన్నా లభిస్తుంది. ఊళ్ళో ప్రాక్టీసు పెట్టిన డాక్టరు మంచివాడే. హస్తవాసి వుంది. మాకే ఇబ్బందీ లేదు. మీ చెల్లెలు చి.ల.సౌ. సరోజ చిన్న పిల్ల. కొత్తవాళ్ళతో సరిగ్గా మాట్లాడగలదో లేదో అని భయం. సర్దుబాటు చేసుకోండి. మీరంతా కలుస్తున్నందుకు పరమానందంగా వుంది. ఒక్కటే చింత. అప్పుడే బరువు బాధ్యతలు నీపై వడ్డాయని. అయినా సరోజా, అల్లుడూ పట్నం రావడమే బాగుంటుంది. వాళ్ళు వచ్చి వెళ్ళాక విశేషాలతో ఉత్తరం రాస్తావు గదూ! నీకూ చి.ల.సౌ. మాధవికి మా ఆశీస్సులు."

ఉత్తరం చదువుకున్న శీను గబగబా బుర్ర గోక్కున్నాడు. ఎవరూ చూడకుండా జుట్టు పీక్కున్నాడు. అంతా అయోమయంగా వుంది. తాను రాసిన ఉత్తరంలోని విషయాలకీ, ఈ ఉత్తరంలోని వాటికీ పొంతనే లేదు. ఎక్కడో ఏదో లోపం జరిగి వుండాలి. పనుల వత్తిడి వల్ల దసరా పండక్కి మాధవిని తీసుకుని ఊరు రాలేకపోతున్నానని రాసిన మాట నిజమే. కొత్తగా పెళ్ళయిన జంటను సరోజనూ, బావగారినీ పండక్కి తీసుకురావడం మన ధర్మం అని సూచించిన సంగతి కూడా వాస్తవమే. అయితే, అందులో హైదరాబాద్ అని అర్థం కాదు. అత్తవారింటికి ఊరు తీసుకురావాలని అర్థం. రిజిస్టర్లో వేసిన నమోదులు కంప్యూటర్ మీద మరోసారి వెరిఫై చేసుకోవడం అలవాటున్న శీనుకు రాసిన ఉత్తరం మళ్ళీ చదువుకోవడం మొదటి నుంచీ అలవాటు లేదు. అదే కొంప ముంచిందనుకున్నాడు. ఎక్కడో

పొరపాటు జరిగింది. అంతా ఇంతా కాదు. కొండంత. కింకర్తవ్యం. అసలే శనివారం. ఆఫ్ డే. త్వరగా ఇంటికి వెళ్ళాలి. బ్యాంకుకు వస్తున్నప్పుడు ఎన్నెన్ని వాగ్దానాలు చేశాడు! పండక్కి షాపింగ్ చేయాలని మాధవి అంటే, ఎగిరి గంతేసి, సరే అన్నాడు. ఎందుకంటే, కాపురానికి వచ్చిన తర్వాత నోరు విప్పి మాధవి కోరడం అదే మొదటిసారి. చీర కొనాలంది. మంచిచీర, జరీచీర. కంచిపట్టు. అలాగే బుష్ షర్ట్‌కి, పాంటుకు ఫస్ట్ క్లాస్ క్లాత్. తనంటే మాధవికి ఎంత ఇష్టం. లేకపోతే ఫస్ట్ క్లాస్ అని ఎందుకంటుంది? ఇవి సరే. బంగారపు ఉంగరం కూడా కొందామని మరీ మరీ చెప్పింది. తన చేతికి పెళ్ళిలో పెట్టిన ఉంగరం ఉందన్నా ఒప్పుకోలేదు. తన చేతికి మరో ఉంగరం చూడాలని మాధవికి ఎంత మనసో, స్పష్టంగా చెప్పకపోయినా ఆమాత్రం అర్థం చేసుకోలేని శక్తి లేనివాడు కాదు శీను. అంతా బాగానే వుంది. లోన్ పెట్టి డబ్బు కూడా సిద్ధం చేసుకున్నాడు. కాని, తండ్రి రాసిన ఉత్తరంతో మొత్తం ప్రోగ్రాం అప్‌సెట్ చేసింది. అంతా తలక్రిందులైందనుకున్నాడు. దసరా పండక్కి అదివారమే చెల్లెలు, బావ వస్తున్నారు. పెళ్ళయిన మొదటిసారి వస్తున్నారు. ఒట్టి చేతుల్తో పంపడం ఎలా? వాళ్ళకి కూడా కొందామంటే చేతిలో అంత డబ్బులేదు. బ్యాంకు టైం అయిపోవస్తోంది. మిత్రుల దగ్గర్నుంచి కూడ కొంత హాండ్‌లోన్ తీసుకుంటేగాని కావలసిన సొమ్ము సమకూరలేదు. లోన్ ఎమౌంట్ అన్నింటికి సరిపోదు. పైగా, ఈ ఉంగరం ఒకటి తన నెత్తిన మొత్తుతోంది.

ఉత్తరం చదువుకుని కలవరపడుతున్న శీను పరిస్థితి మిత్ర బృందానికి అర్థం కాలేదు. 'అంతా క్షేమమేనా?', 'ఎనీప్రాబ్లం', 'షల్ ఉయ్ హెల్ప్' వంటి ప్రశ్నలు మెత్తగా గుండెకు తగిలాయి. వేటికీ సమాధానం సూటిగా చెప్పలేకపోయాడు. అతి కష్టంమీద చిరునవ్వు ఎక్కడ నుంచో పెకలించుకొచ్చి పెదవులపై కాసేపు అంటించుకుని 'అలాంటిదేమీ లేదు. ఎవ్విరిథింగ్ ఓకే. మేము పండక్కి రావడం లేదని మా వాళ్ళు బాధపడుతూ ఉత్తరం రాశారు. మీకు తెలుసుగా మన పని ఎంత హడావుడిగా వుందో. అందుకే అత్తవారింటికీ వెళ్ళడం లేదు. మా వూరికీ వెళ్ళడం లేదు. మీ అందరితోనే దసరా గడుపుతున్నాను' అని లోపల వున్న సమస్యలన్నింటినీ అణగతొక్కి పెద్దగా ఒక నవ్వు నవ్వాడు. అందరూ ఆ నవ్వుతో శ్రుతి కలిపారు. ఇంతలో బ్యాంకు టైం అయిపోవచ్చింది. ఇళ్ళకు బయలుదేరేందుకు ఒక్కరొక్కరే సర్దుకుంటున్నారు.

శీను కాళ్ళు బలంగా ముందుకు సాగడం లేదు. ఏవో సమస్యలు కాళ్ళకు చుట్టుకున్నట్టనిపించాయి. మెట్లు లెక్క పెట్టుకుంటూ దిగాడు, రెండు మూడు కిక్‌లు ఇస్తేగాని స్కూటరు స్టార్ట్ కాలేదు. మామూలుగా వెళ్ళే స్పీడ్ లేదు. ఇంటికి వెళ్ళగానే ఉత్తరం గురించి చెప్పాలా? వద్దా? షాపింగ్ సంగతి ఏమిటి? మర్నాడు స్టేషన్‌కి వెళ్ళి చెల్లెల్ని, బావగారిని తీసుకురావడం గురించిన ప్రస్తావన ఎప్పుడు చేయాలి? ఇలా సమస్యలు దారికి అడ్డువస్తున్నట్టు స్కూటరు స్లోగా సాగుతోంది. ఇంతకీ తప్పంతా తనదే. నిక్షేపంగా మామగారు పండక్కి రమ్మని రాయగానే, సరే అని

జవాబిస్తే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదు. అప్పుడు మాధవి కాదంటే బదులు చెప్పలేకపోయాడు. మాధవి ఏ మాట అన్నా, ఏ పని చేసినా బాగా ఆలోచిస్తుందని శీనుకు తెలుసు. పైగా మాధవి మాటను కాదనలేదు. అది వీక్‌నెసో, ప్రేమ లక్షణమో తేల్చుకోలేకపోయాడు.

అప్పటికే ఇల్లు వచ్చిన సంగతి శీను గమనించలేదు. ఇంకా నయం - ఇంకో క్షణం పరధ్యానంలో వుంటే గేటు దాటిపోయేవాడే. నెమ్మదిగా గేటు తీసి పోర్టికో పక్కగా స్కూటర్ స్టాండ్ వేసి లాక్ చేశాడు. రోజూ 'ఠక్' మని శబ్దం చేసేది. ఇవ్వాళ ఓపిక లేనట్లు స్కూటర్ స్టాండ్ 'టక్' మంది.

మాధవి తలుపు తీసింది. ఆమె పెదవుల మీద చిరునవ్వు దొంతరలు చిగురించాయి. శీనుకోసం వేయి కళ్ళతో ఎదురుతెన్నులు చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. శీనులో నిత్యం వుండే సంతోషం లేదు. స్పందనలు లేవు. రత్నాల నవ్వులు లేవు. కళ్ళల్లో వెలుగుల అలలు లేవు.

శీను ఇంట్లోకి అడుగుపెట్టాడు. ఎంత మార్పు! కొత్తకొత్త అందాలు, ఏర్పాట్లు. తెరలు, గలీబులు, దుప్పట్లు. ఓహ్!! తన ఇల్లేనా అనిపించింది. శీను మనస్సులో సమస్యల తోరణాలు అడ్డురాకపోతే ఎన్ని చిలిపి చేష్టలు చేసేవాడో! మాధవిని ఎంతగా ఉక్కిరిబిక్కిరి చేసేవాడో! ముభావంగా వున్నాడు. భర్తకు కడుపునిండా అన్నం పెట్టందే మాధవి ఇతర విషయాలు మాట్లాడదు. తరచి తరచి అడగదు. మూడ్ గ్రహించి మసలుకోవడం ఆమెకు బాగా తెలుసు.

శీను మధ్య మధ్య ఏవేవో అప్రస్తుత విషయాలు లాంఛనంగా మాట్లాడి భోజనం ముగించాడు.

షాపింగ్ సంగతిగాని, సరోజ రాక గురించి గాని ఎలా చెప్పాలో తెలియక కాసేపు రెస్ట్ తీసుకుంటానని తప్పించుకున్నాడు. మాధవి సరే అంది.

శీను కాస్సేపు మంచం మీద అటు ఇటూ దొర్లాడు. నిద్ర రాలేదు. మాధవికి చెప్పేయాలనుకున్నాడు. నోటితో చెప్పడం కంటే ఉత్తరం చేతికిస్తే సరిపోతుందనే ఉపాయం తట్టింది. గొంతులో మార్దవం నింపుకున్నాడు. 'మాధవీ! నాన్న ఉత్తరం రాశాడు. ఇదిగో చదువు' అని ఉత్తరం ఇచ్చి పేపరు చదువుతున్నట్టు అభినయించాడు.

మాధవి ఉత్తరం చదివింది. గుండెనిండా ఆనందం పొంగులు వారాయి. భర్తను ఆలింగనం చేసుకుని బుగ్గలపై ముద్దుల వర్షం కురిపించింది.

శీనుకు ఏమీ అర్థం కాలేదు. అయినా ఉబ్బితబ్బిబ్బులయ్యాడు. 'మీరు ఎంత మంచివారండి! నా కోరిక తీరింది. ఇంత భాగ్యం నాకు కలుగుతుందని ఊహించలేదు. మీకు గుర్తుందా - మీరు గబగబా మీ నాన్నకి ఉత్తరం రాసి, ఇన్‌లాండ్ లెటర్ రెండో వైపు వదిలేశారు. అత్తయ్యగారికి నా మనసులోని కోరిక రాశాను. అప్పగింతలప్పుడు సరోజతో అన్నాను గుర్తుందా - ఇక నుంచి ఒక్క అత్తయ్యగారే కాదు, వదిన కూడా తల్లిలాంటిదే అని. అందుకే సరోజని, కొత్త

అల్లుణ్ణి ఇక్కడికి పంపే ఏర్పాటు చేయమని, ఇది మన కోరిక అని రాశాను. మన కోరిక తీర్చారు. ఇక షాపింగ్‌కి బయలుదేరండి. విన్నారా? కొనేవన్నీ సరోజకూ, కొత్త అల్లుడికీ. ఉంగరం అతనికే. బట్టలు అతనికే. మా నాన్న కొంత డబ్బు ఎం.ఓ. చేశారు. వాటితో మనం సాదాబట్టలు కొనుక్కుందాం. త్వరగా రెడీ అవ్వండి' అంది ముత్యాల నవ్వులు రాలుస్తూ. శీను పట్టలేని ఆనందంతో మాధవిని రెండు చేతులు పట్టుకుని కృతజ్ఞతతో చుంబించి 'నీది నిజంగా 'మల్లెలమనసు' అని అక్కున చేర్చుకున్నాడు.

*('ఆంధ్రజ్యోతి' సచిత్రవారపత్రిక - 13 అక్టోబర్, 2000)*